క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

కృష్ణా: మండలంలోని ఐనాపూర్ ప్రాథమిక, చేగుంట ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం కాంప్లెక్స్ హెచ్ఎం నాగరాజు, సీఆర్పీ అమీన్‌రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా వారు తొలిమెట్టు పాఠ్యాంశాల బోధన తీరు, విద్యార్థులకు చదవడం, రాయడంతో పాటు మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. అదేవిధంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమనాథ్‌రెడ్డి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తీర్చాలి

నర్వ: మిషన్‌భగీరథ (సత్యసాయి) తాగునీటి పథకం ద్వారా గత ఐదురోజులుగా తాగునీరు బంద్ కావడంతో ఇబ్బందులు పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తాగునీటిని అందించే జూరాల హెడ్‌వర్క్స్ ఇంటెక్ వెల్ వద్ద మోటర్ కాలిపోవడంతో ఈ తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని వారుంటున్నారు. ఉమ్మడి మండలంలోని నాగల్‌కడ్మూర్, బెక్కర్‌పల్లి, పెద్దకడ్మూర్, ఎల్లంపల్లి, చింతరెడ్డిపల్లి, మిట్టనందిమల్ల, ఈర్లదిన్నె, గ్రామాలకు ఈ ఇబ్బందులు ఏర్పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే ఈ మోటర్ మరమ్మతు పనులు పూర్తిచేసి తాగునీటి ఇబ్బందులను తీర్చాలని వారు కోరుతున్నారు.

ఆలయ వంట సామగ్రికి ఆర్థిక సాయం



మరికల్: మండలంలోని ఎలిగండ్లలో చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద జరిగే అన్నదాన వంటసామగ్రికోసం అదే గ్రామానికి చెందిన రామేశ్వర్‌సింగ్ సోమవారం రూ. 50వేలు ఆర్థిక సాయం చేశారు. వంట సామగ్రికోసం ఆర్థిక సాయం చేసిన రామేశ్వర్‌సింగ్‌ను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేటి బచావో.. బేటి పడావోపై అవగాహన



మక్తల్: మండంలోని కర్నిలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బేటి బచావో.. బేటి పడాఓపై అవగాహన నిర్వహించారు. సీడీపీఓ రేణుక బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడైన బాలికలను వేధించడం, బాల్యవివాహాలు చేస్తే ఫోన్ 1098కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, సీడీపీఓ రేణుక, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మక్తల్: క్రీడాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులను సీఐ చంద్రశేఖర్ అభినందించారు. సోమవారం పట్టణంలో సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. ఈ పోటీలో 150మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్ శెట్టి, ఎస్ఐ లక్ష్మారెడ్డి, రిటైర్డ్ పీఈటీ గోపాలం, కావలి ఆంజనేయులు, అంబ్రేష్, రాఘవేందర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరువుతున్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ దయాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సొంత ఇల్లు.. ఎంత కష్టమో..!

- అంచనాలకు మించి పెరుగుతున్న సామగ్రి ధరలు
- పదేళ్ల నుంచి ఇదే పరిస్థితి
- తడిసిమోపెడవుతున్న నిర్మాణ వ్యయం



ధరలు పెరగడంతో మధ్యలో నిలిచిన ఇంటి నిర్మాణ పనులు (ఫైల్)

మరికల్: ‘‘స్టీలు ధరలు రెట్టింపు కంటే ఎక్కువయ్యాయి. ఇసుక ధర దాదాపు మూడింతలైంది. గడిచిన పదేళ్లలో అంచనాలకు మించి ధరలు విపరీతంగా పెరగడంతో గృహ నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ధరల పెంపు మరింత ఎక్కువగా ఉంది. సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న కలను సాకారం చేసుకోవడం కష్టంగా మారింది. మరోవైపు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల ధరలు పెరిగిపోతున్నాయి. ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు ఈ ఏడాది వ్యవధిలో 35నుంచి 65శాతం మేర పెరిగాయి. సిమెంట్, స్టీలు, ఇసుక, విద్యుత్ కేబుల్స్, తలుపులు, కిటికీలకు బిగించేందుకు వాడే మేకుల ధరలు పెరిగాయి. అంతర్జాతీయంగా స్టీలు ఉత్పత్తి తగ్గటంతో డిమాండ్ పెరిగింది.’’

అదనపు భారం..

నిర్మాణ ఉత్పత్తుల ధరలు పెరగడంతో గడిచిన ఏడాదిలో అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగుకు రూ. 800 వరకు ధర పెరిగింది. పట్టణంలో 1500చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు పడకల ఫ్లాట్ కొనుగోలు చేయాలంటే రూ. 70లక్షల పైమాటే. దీంతో ఇతర సదుపాయాల ధరలనూ నిర్మాణదారులు పెంచుతున్నారు. అదే 150 చదరపు గజాల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవాలంటే రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుంది. అపార్ట్‌మెంట్ల నిర్మాణదారులకు సరఫరా చేసే ఉత్పత్తుల ధరలతో పోలిస్తే సొంతంగా ఓ ఇల్లు కట్టుకునే వారికి ఇచ్చే ధరలు పదినుంచి 15శాతం అదనంగా ఉండటం కూడా భారం పెరగటానికి కారణం. విద్యుత్ పరికరాలు, ఫ్లోరింగ్, శానిటరీ, తలుపులు, కిటికీలు, రంగులు ఇలా పలు రకాల వస్తువుల ధరలు భారీగా పెరిగాయి.

మోయలేని విధంగా జీఎస్టీ భారం..

నిర్మాణ రంగంపై ప్రభుత్వం విధించిన జీఎస్టీ భారం భారీగా ఉంది. నిర్మాణ ఉత్పత్తుల్లో అధిక శాతం వస్తువులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసే వారికి 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. ఫ్లాట్ కొనుగోలుపై జీఎస్టీ అయినా ప్లాట్ అయినా అన్నింటిపై అయిదు నుంచి పదిశాతం లోపే జీఎస్టీ విధించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. కేంద్రం ఎలా స్పందిస్తుందో ఇంకా స్పష్టత లేదు.

5 ఏళ్లలో పెరిగిన ధరలు ఇలా..

సామగ్రి	2019	2020	2021	2022	2023
సిమెంట్ ధర	237	283	305	325	330
స్టీలు (టన్నుకు)	41,000	45,775	68,500	68,800	70,100
ఇసుక (టన్నుకు)	395	415	550	850	1200
ఇటుక (వెయ్యికి)	6,500	8,000	8,500	8,600	9000

పెరిగిన ధరలు భయపెడుతున్నాయి..



రెండు అంతస్తుల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాను. పెరుగుతున్న భవన నిర్మాణ సామగ్రి ధరలతో అల్లాడిపోతున్నాం. అనుకున్న బడ్జెట్‌కంటే ఎక్కువగా ఖర్చు అవుతుంది. ముఖ్యంగా స్టీలు, సిమెంట్ , ఇసుక, ఇటుక ధరలు బాగా పెరగడంతో అదనపు భారం పడింది. ఎన్నో కష్టాల మధ్యన ఇంటి నిర్మాణం పూర్తి చేశాను.

చంద్రారెడ్డి, మరికల్

నిర్మాణాలు తగ్గుతున్నాయి..



ఇంటి నిర్మాణ పనులకు కావాల్సిన సామగ్రి ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా ఇసుక కొరతతో నిర్మాణాలు తగ్గుతున్నాయి. గత ఐదేళ్ల నుంచి స్టీలు, సిమెంట్, ఇసుక ధరలతో పాటు ఇతర సామాగ్రి ధరలు పెరగడంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు ధరలను చూసి ముందుకు రావడం లేదు. దీంతో తమకు పనులు కూడా దక్కడం లేదు.

గోపి, మేస్త్రీ, మరికల్

గ్రామాల అభివృద్ధికి పాటుపడుతా..



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: గ్రామాల అభివృద్ధికి పాటుపడుతానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలో కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు పాఠశాలల పక్కా భవనాలు తదితర మౌళిక సదుపాయాల ఏర్పాటు కోసం తనవంతు కృషిచేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్‌చైర్‌పర్సన్ వనజమ్మ, తహసీల్దార్ శివశ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ వెంకటయ్యకు వినతిపత్రం అందించి మాట్లాడారు.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12,769జీపీల్లో 60వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, భద్రతలేని ఉద్యోగంతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణయ్య, మల్లేష్, అనిల్, హన్మంతు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల పరిధిలోని కోల్పూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 413లో ఉన్న భూమి తమ పట్టాదారులుగా ఉన్నామని ఆ భూమిని కొందరు అక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తహసీల్దార్ సతీష్‌కూమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సర్వేనంబర్‌లో ఉన్న భూమిని కొందరు అక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి ఆ భూమి తమకే చెందే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు హరిజన్ తాయప్పం బందప్ప, తిప్పన్న, ఆంజనేయులు, మారుతి, బంగి బాబు, దత్తు, ఆంజనేయులు, రాకేష్ పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు..



కుళాయిలో నుంచి వృథాగా పోతున్న నీరు

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలో పలు కాలనీలో తాగునీరు వృథాగా పోతుంది. గతంలో ఎక్కడ చూసిన ఉప్పునీరు వస్తుండటంతో ఈ మధ్య వాగునుంచి బోరు ద్వారా తాగునీరు గ్రామానికి వస్తున్నాయి. అయితే ప్రస్తుతం గ్రామంలో కొందరు ప్రజలు నిర్లక్ష్యానికి తోడు, అధికారుల అవగాహన కల్పించకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి గ్రామంలోని కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

జాతీయ నాస్తికమేళాను జయప్రదం చేయండి

అమరచింత: గుంటూరు జిల్లా చార్వాకాలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే 32వ జాతీయ నాస్తిక మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం నాస్తిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈమేరకు ఆసంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ భారత పౌరులలో శాస్త్రీయమైన ఆలోచన నింపడానికి 1973లో ప్రగతి విద్యావనం స్థాపించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ విద్యావనమే చారువాకంగా రూపుదిద్దిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అయోధ్య రామాలయం సాకుతో దేశంలో మత విద్వేషాలు పెంచిపోషిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, బుచ్చన్న, ప్రసాద్, అజయ్, రాజు, సోలు, కుతుబ్ పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం ఏకగ్రీవ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా గిరిజన సేవా సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శేఖర్‌నాయక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా లక్ష్మణ్ నాయక్, ప్రధానకార్యదర్శిగా ప్రతాప్‌నాయక్, రమేశ్‌నాయక్, కోషాధికారిగా కిషన్‌పవార్, ఉపాధ్యక్షులుగా ధాక్యానాయక్, గోవింద్‌నాయక్, గోపాల్, వెంకటేశ్, రమేశ్‌నాయక్, రంగ్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేశ్‌నాయక్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనవారిని ఘనంగా సన్మానించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణా: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యశోధ తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, గౌరవ సభ్యులు ఉదయం 11గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఎస్ఐకి ఘన సన్మానం



కృష్ణా: మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మహ్మద్ నవీద్‌ను సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు శాంతిభద్రతలకోసం ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని కోరారు. సమావేశంలో అన్ని పార్టీల నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

నగదు పింఛన్‌పై హర్షం

దామరగిద్ద: దేశ అత్యున్నత పురస్కారాలను అందుకున్న తెలుగు ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షలతోపాటు నెలకు 25వేల పింఛన్‌ను ప్రకటించడంపై మండల యువ నాయకులు సింగారం ఆంజనేయులు, చంద్రశేఖర్ సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. దామరగిద్దకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కొండప్ప లాంటి సామన్యుల గ్రామీణ కలను గుర్తించి కేంద్ర అవార్డుకు ఎంపిక చేయడం రాష్ట్ర ప్రభుతం సహాయం అందించడంపై కృతజ్ఞతలు తెలియజేశారు.

పంచాయతీరాజ్ ఏఈగా విలోక్



మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాలకు పంచాయతీ రాజ్ ఏఈగా విలోక్ సోమవారం ఎంపీపీ విజయలక్ష్మి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆంజనేయరెడ్డి కోస్గి మండలానికి బదిలీపై వెళ్లడంతో మాగనూరు మండలంలో డిప్యూటేషన్‌పై పీఆర్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న విలోక్ తన పోస్టింగ్ స్థానానికి మళ్లీ వచ్చినట్లు ఆయన తెలిపారు.

కేవీపీఎస్ డైరీ ఓ కరదీపిక

మహబూబ్‌నగర్ రూరల్: మహనీయుల జీవిత ఘట్టాలు, రాజ్యాంగం కల్పించిన చట్టాలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పున్నయ్య కమిషన్ సిఫార్సులు, అనేక జీఓలు ప్రచురించి సామాజిక ఉద్యమకారుల చేతుల్లో కేవీపీఎస్ డైరీ ఒక కరదీపిక లాగా ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కేవీపీఎస్ ముద్రించిన 2024 డైరీని ఆయన ఆవిష్కరించారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితులు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు అండగా ఉంటుందని అన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యంరాజు, ఆది విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న శ్రీదేవి

నారాయణపేట రూరల్: మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలని షీ–టీమ్ ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని కొల్లంపల్లి జెడ్పీస్కూల్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100,1930 మహిళా హెల్ప్‌లైన్ నంబర్, 87126 70398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం సల్మా న్‌రాజ్, టీచర్లు నారాయణరెడ్డి, గౌస్, షీటీమ్ సభ్యులు బాలరాజు, నమీనా పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న పుంజనూర్ ఆంజనేయులు

మాగనూర్: కార్మికుల సమస్యలను పరిష్కరించాని కోరుతూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ పుంజనూర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వీఓఏలు, పంచాయతీ కార్మికులతో కలిసి ఆయా శాఖల అధికారులకు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేల వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులు

మద్దూరు: మండలంలోని దోరేపల్లి వాగుపై నిర్మాణం చేపట్టనున్న చెక్ డ్యాం పనులకు సోమవారం జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, మల్లేష్, రామకృష్ణ తదితరులు భూమిపూజ చేశారు. 2.5 కోట్ల వ్యయంతో నీరు పారుదల శాఖ చేపట్టే ఈ చెక్‌డ్యాంతో దాదాపు 300ఎకరాల రైతులకు కొత్తగా ఆయాకట్టు వస్తుందని అధికారులు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు నాయకులు సూచించారు.

12 నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



అవగహన కల్పిస్తున్న డాక్టర్ విరోజ

మాగనూర్: నులిపురుగుల నివారణ కార్యాక్రమం ఈ నెల 12 నుంచి ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారి విరోజ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో ఆశకార్యకర్తలకు, వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఏడాది నుంచి 19 సంవత్సరాల కలిగిన బాలబాలికలకు ఆల్బెండాజోల్ మాత్రలు పాఠశాలలు, కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాలో పంపిణీ చేస్తారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దండు శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డితోపాటు మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మార్నింగ్ వాక్ చేసిన వంశీచంద్‌రెడ్డి

పాలమూరు న్యాయ యాత్ర సందర్భంగా ఆదివారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్త ఇంట్లో నిద్రించిన సీడబ్ల్యూ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి సోమవారం తెల్లవారుజామున మండలంలోని మార్నింగ్ వాక్ చేశారు. పాఠశాల మైదానంలో యువకులతో కలిసి సరదగా క్రికెట్ ఆడి అలరించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో నిత్య పూజల్లో పాల్గొని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, హరిష్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, హరిష్, రామకృష్ణ, రామకృష్ణరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో ప్రత్యేక తనిఖీ



మున్సిపాలిటీ ఎదుట నిలిపిన వాహనం తరలింపు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్, రూరల్, టూటౌన్, వన్‌టౌన్ పోలీసులు సోమవారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. త్రిబుల్ రైడింగ్, నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలతో పాటు, నో–పార్కింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ వాటిపై చర్యలు తీసుకున్నారు. సరైన నెంబర్ ప్లేట్ లేని వాహనాలు అన్నింటినీ ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదురుగా నో–పార్కింగ్ ఏరియాలో నిలిపిన వాహనాలు స్టేషన్‌కు తరలించారు. దీంతో పాటు అశోక్ టాకీస్ చౌరస్తా దగ్గర ఉన్న బ్రిడ్జి నుంచి క్లాక్‌టవర్ వెళ్లే రోడ్డు మధ్యలో తాత్కాలిక డివైడర్ ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన డివైడర్ వల్ల ట్రాఫిక్ సమస్య కొంత తగ్గనుంది. వాహనాల రాకపోకలు సులువుగా జరగనున్నాయి.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్లలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఎదిర జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. మధుప్రియ, జనప్రియ, పల్లవి బంగారు, వర్ష, వైష్ణవి, శ్రీభరత్ రజత, వైష్ణవి, అంకిత్ కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వారిని సోమవారం పాఠశాలలో హెచ్ఎం హేమచంద్రుడు, మాస్టర్ సత్యనారాయణ అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిబాబు, మహేంద్రచారి, శ్రీనివాస్, ఉమారాణి, జాకీర్ హుస్సేన్, పీఈటీ మేరిపుష్ప, కిరణ్‌తోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అబాకస్ పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రవీంద్ర భారతీ పాఠశాలలో విద్యార్థులకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీలను విశ్వం ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 300 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాండెంట్ నందీశ్వర్ విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంస్థ ఏరీయా మేనేజర్ నర్సింహులు, జోనల్ మేనేజర్ రాకేష్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.